## దివ్యాంగులకు ఆటల పోటీలు



జెండా ఊపి పోటీలు ప్రారంభిస్తున్న అధికారి బ్రహ్మాజీ

మెదక్ రూరల్, డిసెంబర్ 13: క్రీడాలతో మానసిక ప్రశాంతత, శారీరకంగా ఆరోగ్యంగా ఉంటారని మెదక్ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి బ్రహ్మాజీ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ ఔట్ డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. అంధులు, శారీరక దివ్యాంగులు, బధిరులు, మానసిక దివ్యాంగులు 10 నుంచి 17 ఏండ్ల మధ్య వయసు గల బాలబాలకలు, సీనియర్స్ 17 నుంచి 35 ఏండ్ల మధ్య ఉన్న వారికి పరుగు పందెం, షాట్‌పుట్, జావెలింగ్ త్రో, చెస్, క్యారం వంటి ఆటల్లో పోటీలు నిర్వహించారు. మొదటి స్థానంలో 22 మంది, ద్వితీయ స్థానంలో 16 మంది, తృతీయ స్థానంలో ఆరుగురు నిలిచారని తెలిపారు. ఈ నెల 15న బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వినయ్‌సుశీల్, సీడీపీఓ స్వరూపరాణి, పీఈటీలు శ్రీనివాస్‌రావు, మధు, మాధవరెడ్డి, వయెవృద్ధుల సంక్షేమ శాఖ సిబ్బంది పద్మలత, కరుణ శీల, సఖీ సిబ్బంది పాల్గొన్నారు.

## రేపు కేంద్ర జాయింట్ సెక్రటరీ పర్యటన

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 13: వీక్షిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా 15న శుక్రవారం కేంద్ర ప్రభుత్వ టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ అజయ్ గుప్తా జిల్లాలో పర్యటించి కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న పథకాల తీరును పరిశీలిస్తారని సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన పర్యటనకు సంబంధించి అదనపు కలెక్టర్(రెవెన్యూ) శ్రీనివాస్‌రెడ్డితో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. శాఖల వారీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది గ్రామంలో కేంద్ర ప్రభుత్వ పథకాల మీద నమూనాలు, ఫ్లెక్సీలు, స్టాళ్లు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ జయదేవ్ ఆర్యా, డీపీఓ దేవకీదేవి, ఎల్‌డీఎం సత్యజిత్, డీఎంహెచ్ఓ డాక్టర్ కాశీనాథ్ పాల్గొన్నారు.

## క్రిస్మస్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 13: క్రిస్మస్ సంబరాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అందించే అవార్డులకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ అధికారి బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. సామాజిక, విద్య, వైద్య, సాహిత్యం, కళలు, క్రీడారంగాల్లో ఉత్తమ సేవలందించిన ప్రతిభావంతులైన క్రైస్తవులు ఈనెల 13 నుంచి 15వ తేదీలోగా దరఖాస్తులను మేనేజింగ్ డైరెక్టర్ తెలంగాణ రాష్ట్ర (క్రిస్టియన్ మైనారిటీస్) ఫైనాన్స్ కార్పొరేషన్ హైదరాబాద్ కార్యాలయం నుంచి వ్యక్తిగతంగా లేదా www.tscmfc.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకొని, పూర్తి చేసిన దరఖాస్తులను 15న సాయంత్రం 5 గంటలలోగా జిల్లా మైనారిటీ సంక్షేమ కార్యాలయంలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాల కోసం 040-23391067 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

# ప్రజల ఆకాంక్ష మేరకు అభివృద్ధి

- సంక్షేమంపై రాజీపడేది లేదు
- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



సమవేశంలో మాట్లాడుతున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, డిసెంబర్ 13: ప్రజల ఆకాంక్షల మేరకు ప్రగతి పనులు చేపడుతామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం పటాన్‌చెరు పట్టణంలోని జీఎమ్మార్ కన్వెన్షన్ హాలులో అభివృద్ధి పనులపై నియోజకవర్గ స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనుల ప్రగతిపై అధికారులతో చర్చించారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత నియోజకవర్గంలో రూ.9వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. మున్ముందు అదేస్ఫూర్తితో పనిచేస్తామన్నారు. ప్రభుత్వాలు మారినా అభివృద్ధి పనులు చేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపైనే ఉంటుందని చెప్పారు. ప్రజా అవసరాలు, భవిష్యత్ డిమాండ్లను గుర్తించి ప్రణాళికాబద్ధంగా పనులు చేద్దామన్నారు. నిర్లక్ష్యానికి తావివ్వకుండా అధికారులు సకాలంలో పనులు పూర్తి చేయాలని సూచించారు. నీటి పారుదల, పంచాయతీరాజ్, విద్యుత్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల పనులు ముఖ్యమైనవని తెలిపారు. నిర్దేశించిన పనులకు నిధులు, ఇతర ఆదాయ వనరులను సమకూర్చుకొని పనులు పూర్తి చేయాలన్నారు. నిధుల కొరత ఉంటే తనకు తెలపాలన్నారు. ప్రభుత్వ నిధులతో పాటు సీఎస్సార్ నిధులు కూడా వాడుకొని పనులు చేపట్టాలన్నారు. పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ యార్డును విస్తరిస్తున్నామని తెలిపారు. యార్డ్ సమీపంలోని రైల్వే శాఖకు సంబంధించి 20 ఎకరాల భూమిని మార్కెట్ యార్డుకు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వానికి విన్నవించుకున్నామన్నారు. ప్రజా సంక్షేమానికి తొలి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ సుష్మాశ్రీవేణుగోపాల్‌రెడ్డి, దేవానందం, ప్రవీణావిజయభాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీలు సుప్రజా వెంకట్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కుమార్‌గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# రసాభసగా ఆల్‌పార్టీ మీటింగ్

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి పనితీరుపై నిరసన
- నిబంధనలు పాటించలేదని, సకాలంలో సమాచారం ఇవ్వలేదని ఆరోపణ



సమావేశంలో అధికారులను నిలదీస్తున్న రాజకీయ పార్టీల నేతలు

హుస్నాబాద్, డిసెంబర్ 13: హుస్నాబాద్‌లోని ఐవోసీ భవనంలోని ఆర్డీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన ఆల్‌పార్టీ మీటింగ్ రసాభసగా సాగింది. ఈ సమావేశానికి ఆర్డీవో బెన్‌షాలోమ్ గైర్హాజరు కావడంపై సీపీఐ, కాంగ్రెస్ పార్టీల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్డీవో హాజరు కాని సమావేశానికి మమ్మల్ని ఎందుకు పిలిచారని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీల నాయకుల సమావేశాల్లో చెప్పిన ఏ ఒక్క నిబంధనను కూడా రిటర్నింగ్ అధికారిగా ఉన్న ఆర్డీవో పాటించలేదని ఆరోపించారు. పోలింగ్ బూత్‌లకు దూరంగా ఉన్న కాలనీల నుంచి గానీ, అనుబంధ గ్రామాల నుంచి గానీ ఓటర్లను బూత్ వరకు తీసుకొచ్చేలా ట్రాన్స్‌పోర్టు సౌకర్యం కల్పిస్తామని చెప్పి, ఎక్కడా ఏర్పాటు చేయలేదని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ ఆరోపించారు. అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామంతో పాటు భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లోని పలు బూత్‌లలో పోలింగ్ ఆలస్యం కావడానికి ఆర్‌వోనే కారణమని, మిషన్లు సతాయించినప్పుడు సకాలంలో స్పందించకపోవడంతోనే పోలింగ్ రాత్రి 9గంటల వరకు నిర్వహించారని ఆరోపించారు. ఎన్నికల నిబంధనలకు సంబంధించి ఎలాంటి సమాచారం ఇవ్వలేదని ఎఐఎస్‌బీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్ ఆవేదన వ్యక్తంచేశారు. పోస్టల్ బ్యాలెట్, వృద్ధుల ఓట్ల పోలింగ్ విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం వహించారన్నారు. సమావేశంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు కేడం లింగమూర్తి, బీఎస్పీ నాయకుడు ఎనగందుల శంకర్, డీఎస్పీ నాయకుడు సదన్‌మహరాజ్ పాల్గొన్నారు.

## కలిసివచ్చే విద్యాసంస్థలతో పనిచేస్తాం



సదస్సును ప్రారంభిస్తున్న గీతం ప్రతినిధులు

పటాన్‌చెరు, డిసెంబర్ 13: ఉన్నతాశయం ఉన్న మాధ్యమిక విద్యాసంస్థలతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని గీతం అధ్యక్షుడు శ్రీభరత్ అన్నారు. బుధవారం రుద్రారంలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ క్యాంపస్‌లో భారతీయ విద్యా నాయకత్వ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీభరత్ సీబీఎస్ఈ పాఠశాలలు, ఐబీ స్కూల్స్, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లను ఉద్దేశించి మాట్లాడారు. తాము లిబరల్ ఎడ్యుకేషన్‌కు ప్రాధాన్యం ఇస్తున్నామని, కలిసొచ్చే పాఠశాలలతో కలసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కృత్రిమ మేథాతో భవిష్యత్తులో ఐటీ రంగంలో ఉద్యోగాలు కోల్పోతామని చెప్పారు. కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీతో మాస్టర్స్ ప్రోగ్రామ్ నిర్వహిస్తూ ప్రపంచస్థాయి విద్య అవసరాన్ని చాటిచెబుతున్నామన్నారు. ఉన్నత విద్యలో ఆవిష్కరణలపై ప్యానల్ చర్చ నిర్వహించారు. వచ్చే వేసవిలో విద్యార్థుల కోసం ఉచితంగా సమ్మర్ స్కూల్ ప్రారంభిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఈఎంఐ సర్వీసెస్ ఇండియా సహ వ్యవస్థాపకురాలు లక్ష్మీ అన్నపూర్ణ, గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి డీఎస్ రావు పాల్గొన్నారు.

# నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలి

**సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 13: అధికారులు ఈ నెల చివరి వరకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో కలిసి ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలు, ఏపీఎం, మున్సిపల్, ప్రభుత్వ, ప్రైవేటు గ్రామీణ బ్యాంకుల అధికారులతో సమావేశం నిర్వహించారు. డీఆర్‌డీఏకు సంబంధించిన సెర్ప్ బ్యాంకు లింకేజీ కార్యక్రమంపై మండలాల వారీగా డీఆర్‌డీఓ, ఏపీఎం, ఎల్‌డీఎం, అన్ని బ్యాంకుల అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎస్‌హెచ్‌జీ రుణాలు రూ.743.68 కోట్లకు రూ.599.57 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. మెప్మా ద్వారా రూ.49.65 కోట్లకు రూ.61.31 కోట్లు పూర్తి చేసినందుకు అధికారులను అభినందించారు. వీధి వ్యాపారులకు సంబంధించి రెండు, మూడో లింకేజీ రుణాలు నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర, ఘర్ ఘర్ కిసాన్ క్రెడిట్ కార్డు అభియాన్ గురించి గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. సురక్ష జీవన్ జ్యోతి బీమా, ఏపీవై పింఛన్ పథకాల గురించి వివరించాలన్నారు. హరితహారం కార్యక్రమానికి ఇప్పటినుంచే సిద్ధం కావాలన్నారు. ఈజీఎస్‌లో కూలీల సేకరణ శాతంలో జిల్లా కింది వరుసలో ఉన్నదని అసహనం వ్యక్తం చేశారు. కూలీల సంఖ్య ను పెంచేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓలకు సూచించారు. జిల్లాలో కొత్తగా ఫాంపాండ్, ఫిష్‌పాండ్‌లను ఏర్పాటు చేసేందుకు క్షేత్రస్థాయిలో గ్రామాల్లో పర్యటించి చర్యలు తీసుకోవాలన్నారు. అమృత్ సరోవర్ పథకంలో భాగంగా మండలానికి ఒక చెరువు నిర్మించాలన్నారు. తోటల పెంపకం లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని.. ఎలాంటి సమస్యలు ఎదురైనా అధికారుల తన దృష్టికి తీసుకురావాలన్నారు. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ జయదేవ్ ఆర్యా, ఎల్‌డీఎం సత్యజిత్, జడ్పీ సీఈఓ రమేశ్, డీపీఓ దేవకీదేవి, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# తెల్ల కుసుమతో అధిక లాభాలు



తెల్ల కుసుమ సాగుపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త రమేశ్

న్యాల్‌కల్, డిసెంబర్ 13: రైతులను సంప్రదాయ పంటల నుంచి ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జహీరాబాద్ డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రమేశ్ అన్నారు. బుధవారం మండలంలోని రేజింతల్ గ్రామంలో డీడీఎస్-కేవీకే ఆధ్వర్యంలో తెల్ల కుసుమ పంట సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలో 7వేల ఎకరాల్లో రైతులు తెల్లకుసుమ సాగు చేస్తున్నారని తెలిపారు. యాసంగి సీజన్‌లో తెల్ల కుసుమను సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని చెప్పారు. ఈ పంట సాగుకు నల్లరేగడి భూములు అనుకూలమన్నారు. డీడీఎస్-కేవీకే ఆధ్వర్యంలో పంపిణీ చేసే ఐఎస్ఎఫ్ -764 రకం కుసుమ విత్తనాలను రైతులు సాగు చేయాలన్నారు. కేవలం 125-130 రోజుల్లోనే పంట చేతికి వస్తుందని చెప్పారు. వర్షాధారం కింద సాగు చేస్తే ఎకరానికి 6 క్వింటాళ్లు, నీటి పారుదల కింద సాగు చేస్తే 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్త స్నేహలత, డీడీఎస్-కేవీకే ప్రతినిధులు, గ్రామ ప్రజా ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.